క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

చుంచుపల్లి: కొత్తగూడెం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులకు తమ సమస్యలను నేరుగా తెలిపేందుకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచనలు సలహాలు, ఫిర్యాదుల నిమిత్తం 99592 25959 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

రేపు పెద్దమ్మతల్లి గుడిలో రుద్రహోమం

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా బుధవారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనున్న హోమంలో పాల్గొననున్న భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని ఈఓ కోరారు.

సమస్యలు పరిష్కరించాలని దీక్ష


దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని సీపీఎం కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఒక్కరోజు దీక్ష చేపట్టారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేశ్ దీక్షను ప్రారంభించి మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లిక్కి బాలరాజు, రమేశ్, వీరన్న, ప్రకాష్, అన్నవరపు పద్మ, ఆలేటి శ్రీను, అభిమన్యు, వీరభద్రం, నాగకృష్ణ, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

జూలూరుపాడు: రూ.2 లక్షలు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం జూలూరుపాడులో బీజేపీ జిల్లా నాయకులు నున్నా రమేశ్ నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా హైడ్రా, మూసీ నది ప్రక్షాళన పేరుతో ప్రజల దృష్టి మరలించేందుకు యత్నిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో చిలుకూరి రమేశ్, ఈవీ రమేశ్, నెల్లూరు కోటేశ్వరరావు, కొవ్వూరి నాగేశ్వరరావు, మాదినేని సతీశ్, నున్నా రమేశ్, సిరిపురపు ప్రసాద్, భూక్యా రమేశ్, సిరిపురపు గోపాల్‌రావు, వందనపు సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాల విత్తన లైసెన్సులు తొలగింపు

సుజాతనగర్: ఎంటీయూ 1262 రకాన్ని పోలిన విత్తనాలు విక్రయించిన రెండు దుకాణాలకు సంబంధించిన విత్తన లైసెన్సులను తొలగించినట్లు మండల వ్యవసాయాధికారిణి గాండ్ల నర్మద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ అంబికా ఫెర్టిలైజర్స్, సాయి పరమేశ్వరీ ట్రేడర్స్ దుకాణాల డీలర్లు ఎంటీయూ 1262 రకం అని చెప్పి సుమారు 450 బ్యాగుల వరి విత్తనాలను రైతులకు విక్రయించారు. ఈ రకం పంట కాల పరిమితి 160 రోజులు కాగా..100 రోజులకే వరిలో కంకులు వచ్చిన నేపథ్యంలో గత 15 రోజులుగా రైతులు ఆందోళన చేస్తూ వస్తున్నారు. దీంతో వ్యవసాయాధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. డీలర్లు విక్రయించిన విత్తనాలు ఎంటీయూ 1262 రకాన్ని పోలినవేనని తేల్చినట్లు తెలిపారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు దుకాణాల విత్తన విక్రయ అనుమతులను తొలగించినట్లు తెలిపారు.

కుటుంబ వ్యవస్థను రక్షించుకోవాలి

పాల్వంచ: ధర్మాన్ని పాటిస్తూ సామరస్యంగా మెలగాలని, భారత దేశానికి మూల స్తంభమైన కుటుంబ వ్యవస్థను రక్షించుకోవాలని వక్కలంకకు చెందిన కుర్తాలం పీఠాధిపతి శిష్యులు శ్రీశ్రీశ్రీ వాసుదేవానంద భారతి స్వామి అన్నారు. సోమవారం జెన్‌కోకాలనీలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన భక్తులకు ఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో జెన్‌కో ఏడీఈ పావని, కిశోర్, చిరంజీవి, రామచందర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

ఇంకా ఎన్నేళ్లు వేచిచూడాలో..

16 ఏళ్లయినా ఎవరికీ పట్టని గృహాలు

- ఇందిరమ్మ ఇళ్లను కమ్మేసిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు
- డంపింగ్‌యార్డును తలపిస్తున్న ఇందిరమ్మకాలనీ
- రూ.కోట్లు వృథా.. చేజిక్కించుకుంటున్న దళారులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం


ఇందిరమ్మ ఇళ్లను కమ్మేసిన ముళ్ల పొదలు, పేరుకుపోయిన చెత్తాచెదారం

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా కేంద్రానికి కూతవేటు దూరాన సుమారు 16 ఏళ్ల కిందట నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు మనగడలోకి రాక.. పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు కమ్మేశాయి. చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడంతో డంపింగ్‌యార్డును తలపిస్తున్నాయి. కొత్తగూడెం నియోజకవర్గానికి ఆనాటి ప్రభుత్వం సుమారు 2 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. పాత కొత్తగూడెంలో 800, రామవరం 8, 9 వార్డుల (పాత 9, 10)కు 1,200 ఇళ్లు కేటాయించారు. అయితే, నిధుల కొరత, ఇతర కారణాలతో కొందరు ఇళ్లు నిర్మించుకోగా, మరికొందరు పూర్తిస్థాయిలో కట్టక వదిలేయడంతో పనికి రాకుండా పోయాయి.

బీసీకి రూ.80 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష

ఇళ్ల నిర్మాణానికి బీసీ వర్గాలకు రూ.80 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష కేటాయించారు. 50 బస్తాల సిమెంట్, రెండు తలుపులు, నాలుగు కిటికీలు కలిపి ఈ నిధులు అందిస్తామని తెలిపారు. అయితే బిల్లులు సకాలంలో రాక, ఇంటి నిర్మాణానికి నీరు అందుబాటులో లేక నిర్మించుకోలేకపోయామని లబ్ధిదారులు చెబుతున్నారు. మరోపక్క అధికారుల పర్యవేక్షణ లేకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.10 వేలు చెల్లించి నీరు కొనుక్కోవాల్సి రావడంతో చాలా మంది విముఖత చూపారు. అంతేకాక స్పెషల్ స్కీమ్ కింద వేసిన బోర్లు పనిచేయక, ఎంపీ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్ కూడా పనిచేయలేదు.

ప్రభుత్వాలు మారినా అంతే..

రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా రామవరం ఇందిరమ్మ కాలనీ దుస్థితిని ఎవరూ పట్టించుకోలేదు. సుమారు 16 ఏళ్ల కిందట ఇక్కడ వెంకటేశ్‌ఖని పంచాయతీలోని ఆనందఖని, వనమానగర్, మార్కెట్ ఏరియా, ఎస్‌ఆర్‌టీ కాలనీ వారికి స్థలాలు కేటాయించారు. కానీ, కొన్ని పూర్తి, ఇంకొన్ని అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం జరిగింది. వెంకటేశ్‌ఖని వాసులు అప్పటివరకు వారు ఉంటున్న ఇళ్లను ఖాళీ చేసి రామవరంలో ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చినా నీరు లేక వెళ్లిపోయారు. ఆ తర్వాత స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలతో రామవరానికి చెందిన కొందరికి ఈ కాలనీలో స్థలాలు కేటాయించారు.

ఆక్రమణదారుల చేతుల్లో ఇళ్లు

పూర్తిస్థాయిలో బిల్లులు అందక సతమతమవుతూ లబ్ధిదారులు ఇళ్లను అసంపూర్తిగా వదిలేశారు. ఆపై ఈ ప్రాంతంలో ప్రభుత్వం గురుకుల పాఠశాల నిర్మించింది. ఇందులో భాగంగా కొందరు నిర్మించుకున్న ఇళ్లు కూడా సేకరించారు. అలాగే, వెంకటేశ్‌ఖని ప్రాంతంలో ఉన్న ప్రజలను ఇళ్లు పూర్తి కాకముందే ఖాళీ చేయించడంతో చాలామంది ఇంటి సంబంధించిన పత్రాలు పోగొట్టుకున్నారు. ఇదే అదనుగా దళారులు పేదల ఇళ్లను కైవసం చేసుకొని అమ్మి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయినా అధికారులు ఈనాటికీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఓసీ వస్తుందని ఖాళీ చేయించారు.



2006లో ఓసీ వస్తోందని, వెంకటేశ్‌ఖని నుంచి వెయ్యి కుటుంబాలను ఖాళీ చేయించారు. ఇప్పటివరకు ఓసీ రాలేదు. యాజమాన్యం నిర్లక్ష్యంతో చెట్టుకొకరం, పుట్టకొకరం అయ్యాం. రామవరంలో స్థలాలు కేటాయించినా ఇళ్లు నిర్మించుకునే స్థోమత లేక గూడు కోల్పోయాం.

–నాగరాజు, వీకే–7 వాసి

ప్రభుత్వ సహకారం లేకనే..



నాటి ప్రభుత్వం స్థలాలు కేటాయించినా ఇంటి నిర్మాణ విషయంలో సహకారం అందించలేదు. ఇసుక, నీరు, అందిస్తే ఫలితం మరోలా ఉండేది. ఆర్థికంగా వెనుకబడిన వారు అవడంతో బిల్లులు రాకున్నా అప్పులు తెచ్చి కొంత మేర నిర్మించుకున్నారు. ఆ తర్వాత చేసేదేం లేక వదిలేశారు.

–మామిడి రాజేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్, వెంకటేశ్‌ఖని

ఉద్యోగులకు వ్యక్తిత్వ వికాసం అవసరం


మాట్లాడుతున్న జవాది వెంకటేశ్వరబాబు

ఇల్లెందు: వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే పోలీసులు సహజంగా ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంటుందని, వారికి వ్యక్తిత్వ వికాసం తరగతులు అవసరమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు జవాది వెంకటేశ్వరబాబు తెలిపారు. సోమవారం ఇల్లెందు సబ్‌డివిజన్ పోలీసులకు ఐతా ఫంక్షన్‌హాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒత్తిడి ఎలా జయించాలో వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రభాను, సీఐలు బత్తుల సత్యనారాయణ, పి.సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చుంచుపల్లి: విద్యానగర్ జీవీ మాల్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన పూనూరు త్రిమూర్తి హౌసింగ్ బోర్డ్ నుంచి ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వస్తున్నాడు. జీవీ మాల్ వద్ద ఓ మహిళ రోడ్డు దాటుతోంది. ఆమెను తప్పించబోయి అదుపుతప్పి ద్విచక్ర వాహనంపై నుంచి ఎగిరి డివైడర్‌పై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు


ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న నాయకులు


పాల్వంచ: అనాథాశ్రమంలో నిత్యావసరాలు అందిస్తున్న నాయకులు

ఇల్లెందు/పాల్వంచ/కొత్తగూడెంరూరల్/జూలూరుపాడు/టేకులపల్లి/పాల్వంచరూరల్/సుజాతనగర్: రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇల్లెందులో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డీవీ, డానియేల్, పులి సైదులు జానీపాషా, కొక్కు నాగేశ్వరరావు, వారా రవి, పత్తి స్వప్న, సుదర్శన్ కోరీ, చీమల నాగరత్నమ్మ, మండల రాము, సురేందర్, తాటి యశోద, స్వాతి, పద్మ, సాంబమూర్తి, సూర్యం, శ్రీనివాస్, సదానందం, భిక్షం, కృష్ణ, అనసూర్య, మాధవరావు పాల్గొన్నారు. పాల్వంచలోని అనాథాశ్రమంలో మొక్కలు నాటి, పిల్లలకు నిత్యావసర సరుకులు, పుస్తకాలు అందించారు. డాక్టర్ యుగంధర్‌రెడ్డి, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, తుమ్మల శివారెడ్డి, టేకుల సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఇంకా పలుచోట్ల నిర్వహించిన వేడుకల్లో కొత్వాల శ్రీనివాసరావు, కొండం వెంకన్న, జానకీరెడ్డి, ముత్తయ్య, వాసుదేవరావు, రామలింగం, ఆచార్యులు, నల్లా సురేశ్‌రెడ్డి, శ్రీను, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డలోని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఇంట్లో.. అలాగే జూలూరుపాడులో నిర్వహించిన మంత్రి జన్మదిన వేడుకల్లో రాందాస్‌నాయక్‌తోపాటు శంకర్‌బాబు, చావా శ్రీనివాస్, తూము చౌదరి, లేళ్ల వెంకటరెడ్డి, మంగీలాల్‌నాయక్, నరసింహారావు, లాలునాయక్, లచ్చునాయక్, పుల్లారావు, కృష్ణయ్య, ధర్మా పాల్గొన్నారు. టేకులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమాల్లో కోరం సురేందర్, భూక్య దేవా, పోశాలు, మంగీలాల్, మధురెడ్డి, రెడ్యానాయక్, బండ్ల రజిని పాల్గొన్నారు. లక్ష్మీదేవిపల్లి వృద్ధాశ్రమంలో కేక్‌కట్ చేశారు. గోశాలకు ఫ్యాన్లు అందించారు. యుగంధర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. సుజాతనగర్‌లో నాగా సీతారాములు కేక్ కట్ చేశారు. రాజశేఖర్, పిచ్చిరెడ్డి, రాంబాబు, వీరహనుమంతరావు, శ్రీనివాసరెడ్డి, నాగర్జున్ పాల్గొన్నారు.

ఆ ప్రతిపాదన సరికాదు


మాట్లాడుతున్న కాసాని ఐలయ్య


సుజాతనగర్: ఎవరిని సంప్రదించకుండా సుజాతనగర్ ఉమ్మడి పంచాయతీ కార్పొరేషన్ చేయాలనుకునే ఆలోచన సరికాదని సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య అన్నారు. సోమవారం చింతలపూడి సత్యంభవన్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సుజాతనగర్ ఉమ్మడి పంచాయతీని కార్పొరేషన్‌గా మార్చాలని ప్రతిపాదన చేసిందని, అయితే ఈ ప్రాంతం ఇంకా అర్బన్‌గా అభివృద్ధి చెందలేదన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీర్ల రమేశ్, ఐచ్చలకూర శ్రీనివాస్, కాత్రాల తిరుపతిరావు, కొండ కృష్ణ, నల్లగొప్పు పుల్లయ్య, బాలు వెంకటేశ్వర్లు, భూక్యా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సందల్ శోభాయాత్ర


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీబస్తీ గ్రామపంచాయతీ హజరత్ ఇమామ్ ఖాసీం ఆషుర ఖానాలో గార్పీ పర్వదినాన్ని పురస్కరించుకొని సయ్యద్ యాకూబ్‌షావలి బాబాకు మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం బాబాకు సందల్ సమర్పించే కార్యక్రమాన్ని భక్తులు కోలాహలంగా నిర్వహించారు. సీఎస్పీబస్తీ నుంచి పట్టణంలోని పాతబస్టాండ్, జగదాంబసెంటర్ మీదుగా హజరత్ ఇమామ్ ఖాసీం ఆషురఖానా వరకు సందల్‌తో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం దర్గా ప్రాంగణంలో భక్తులకు గార్పీ విందు ఇచ్చారు. కార్యక్రమంలో దర్గా మాలిక్ మహ్మద్ పాషా, నిర్వాహక కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగల విజయంగా భావిస్తూ నవంబర్ 6న జరుపతలపెట్టిన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని టీఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేకల శ్యామ్ కోరారు. సోమవారం ఇల్లెందులో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముత్తయ్య, అనిల్, ప్రసాద్, సంజీవరావు, మోసయ్య, శ్రావణ్, బాబూరావు, జీవన్, వేణుగోపాల్, రామకృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఏఐకేఎంఎస్ ధర్నా


ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఆరు గ్యారంటీలను సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఉప్పరబోయిన రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బానోత్ ఊక్లా, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరం సత్యనారాయణ మాట్లాడారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలన్నారు. అధికారంలోకి వచ్చాక పాలకులు రైతులుకు మొండి చేయి చూపుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కందగట్ల సురేందర్, గుగ్గెల పాపారావు, నెల్లూరి నాగేశ్వరరావు, ఎం.సుగుణ, వి.ఉమ, పెనక రామస్వామి, సీహెచ్ కృష్ణ, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

రైతుసంఘం ఆధ్వర్యంలో..

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయక తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఏఐకేఎంఎస్ అనుబంధ తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ అన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్ల వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో సలిగింటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, కుమారి హనుమంతరావు, గుగులోత్ రాంచందర్, రమేష్, రోశయ్య, ఇమానియల్, సీతారామిరెడ్డి, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో విజిలెన్స్ వారోత్సవాలు


సింగరేణి(కొత్తగూడెం): ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు


ఇల్లెందు: ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ఏరియా జీఎం శాలేంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. జీఎం కార్యాలయంలో ఉద్యోగులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. జీఎం మాట్లాడుతూ.. పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించే లక్ష్యంతో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 28 నుంచి నవంబర్ 3 వరకు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎండీ రజాక్, వి.మల్లికార్జున్‌రావు, కోటిరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు. కాగా, కొత్తగూడెం ఏరియాలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ చైన్‌మెన్ పదోన్నతులకు సోమవారం పరీక్ష నిర్వహించారు. ఎస్‌వోటూ జీఎం కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఏరియాలో టైమ్ రేటెడ్ ఖాళీలను భర్తీ చేసేందుకు రెండు చైన్‌మెన్ పదోన్నతుల కోసం ప్రాక్టికల్ టెస్టులు నిర్వహించామని చెప్పారు. సదానందం, బి.శివకేశవరావు, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో విజిలెన్స్ వారోత్సవాలను ఏరియా జీఎం జాన్‌ఆనంద్ సోమవారం ప్రారంభించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3 వరకు సింగరేణివ్యాప్తంగా సాగే వారోత్సవాలను ఉద్యోగులు, కార్మికులు విజయవంతం చేయాలని జీఎం తెలిపారు. అవినీతిని అరికట్టేందుకు నగదు రహిత విధానం, సీసీ కెమెరాలు, కార్యాలయాల్లో బయోమెట్రిక్ విధానాలను ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బొల్లం వెంకటేశ్వర్లు, గిరిధర్‌రావు, నరసింహరాజు, జీవీ మోహన్‌రావు, సర్వే బాలాజీనాయుడు పాల్గొన్నారు.

వైకుంఠధామంలో శివుడి విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన కొదుమూరి రాఘవయ్య – శకుంతల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొదుమూరి కోటేశ్వరరావు వైకుంఠధామంలో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, అల్లాడి నరసింహారావు, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, బానోత్ నవీన్, నున్నా కృష్ణయ్య, ధ్మరాజుల వెంకటనారాయణ, వేల్పుల నరసింహారావు, బానోత్ ధర్మా, ధరావత్ రాంబాబు, నిమ్మటూరి కనకయ్య, భూక్యా చందా నాయక్, సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేశ్ పాల్గొన్నారు.

సింగరేణిలో ఇకపై సీబీఎస్ఈ సిలబస్

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆర్జీ–2లో అమలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆధ్వర్యంలో రామగుండం–2 ఏరియాలో నిర్వహిస్తున్న పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయనున్నట్లు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కొత్తగూడెంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆర్జీ–2 ఏరియాలో గల సెక్టార్–2 పాఠశాలలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సీబీఎస్ఈ నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఆ పాఠశాలను ఎంపిక చేశామని, సీబీఎస్ఈ కేంద్ర బృందం నవంబర్‌లో ఆ పాఠశాల తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, క్రీడా మైదానం తదితర అంశాలను పరిశీలించనుందని వెల్లడించారు. పరిశీలన తర్వాత బృందం అనుమతితో 2025 –26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు శ్రీకారం చుడతామని తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలకు మంచి భవిష్యత్ ఇచ్చే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఆ తర్వాత 2026 – 27 విద్యాసంవత్సరంలో కొత్తగూడెంలో కూడా ఈ సిలబస్ అమలుకు అవకాశం ఉందని వివరించారు. 1975లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలు ప్రారంభమైనప్పుడు అడ్మిషన్లకు డిమాండ్ ఎక్కువగా ఉండేదని, సీబీఎస్ఈ సిలబస్ అమలుతో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న సీఈ వెంకటేశ్వరరావు

పాల్వంచ: అవినీతి నిర్మూలనకు కృషి చేయాలని కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కేంద్ర నిఘా సంస్థ ఆదేశాల మేరకు నిఘా అవగాహన వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. ఉద్యోగులు విధుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎన్.రమేశ్, ఏసీలు, డీఈలు, విజిలెన్స్, ఫైర్, ఎస్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ


శిక్షణ పొందటానికి వచ్చిన మహిళలతో సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్

ఇల్లెందు: మహిళలు తమలోని ప్రతిభను వెలికి తీసి నైపుణ్యాన్ని అభివృద్ధి పర్చుకోవాలని సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మిఆనంద్ తెలిపారు. సోమవారం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభి మాట్లాడారు. స్వయం ఉపాధి ద్వారా తమ కుటుంబాలను పోషించుకోవచ్చని తెలిపారు. సేవా సమితి ద్వారా రెండు టైలరింగ్ కోర్సులు, రెండు మగ్గం, మూడు బ్యూటీషియన్ కోర్సుల ద్వారా 175 మందికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, అనంతరం ధ్రువపత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయిస్వరూప్, సేవా సహాయ కార్యదర్శి సులక్షణ, సభ్యులు, శిక్షకులు పాల్గొన్నారు.